# 'రోహిత్ మరణం - ఆత్మహత్యకాదు, హిందూ మతోన్మాదులు చేసిన హత్యే'

**బందరు, 27-1-16 :**

హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీలో పిహెచ్‌డి విద్యార్థి వేముల రోహిత్ మరణానికి కారకులైన హిందూ దురహంకారులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేస్తూ సిపిఐ(ఎం.ఎల్) బందరు ఏరియా ఆధ్వర్యంలో 27-1-2016 తేదీన మచిలీపట్నం కలక్టరు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి సిపిఐ(ఎం.ఎల్) జిల్లా నాయకులు కా॥యద్దనపూడి సోని ప్రసంగిస్తూ 'హైద్రాబాదు సెంట్రల్ యూనివర్సిటీలో అణగారిన దళిత కులాలు, పేద వర్గాలకు చెందిన విద్యార్థులను తమ ఆధిపత్యంకోసం హిందూత్వశక్తులు వేధిస్తూ, భయపెడుతూ చాలా సం॥లుగా ప్రయత్నిస్తున్నారన్నారు. కేంద్రంలో నరేంద్రమోడి వచ్చాక హిందూత్వశక్తులు పేట్రేగిపోయి తమ ప్రయత్నాలను తీవ్రం చేశారని, దీని పరాకాష్టే 'రోహిత్ ఆత్మహత్య' అన్నారు. ఇది వాస్తవంగా హిందూదురహంకారులు చేసిన హత్యే నన్నారు. రోహిత్ దళితుడు కాదంటూ కులాన్ని వివాదం చేయడంద్వారా జరిగిన ఘటనను ప్రక్కదారి పట్టిస్తు న్నారన్నారు. హిందూ మతతత్వశక్తులు అభ్యుదయ, ప్రగతిశీల భావాలను అణచివేస్తూ క్రూరంగా వ్యవహరిస్తున్నారని; దీనిలో భాగమే మహారాష్ట్రకు చెందిన డా॥ నరేంద్ర దభోల్కర్‌ను, కన్నడ సాహితీవేత్త యం.యం.కల్బుర్గీని, సి.పి.ఐ. నాయకుడు గోవింద పన్సారే వంటి మేధావులను, రచయితలను హత్య చేస్తున్నారని; వారిపై దాడులు చేస్తున్నారని అన్నారు.

దేశం నుండి సంపదలు తరలిపోయేందుకు అవకాశంకల్పిస్తున్న పాలకుల విధానాలకు వ్యతిరేకంగా, ప్రైవేటు యూనివర్సిటీలకు వ్యతిరేకంగా నిలబడటం, భూస్వామ్య, పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద దోపిడీకి వ్యతిరేకంగా పోరాడటమే మన ముందున్న కర్తవ్య మన్నారు. ఇంకా రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లా నాయకులు కా॥ కొప్పినేని ఉమామహేశ్వరరావు, కా॥ ఈపూరి రాంబాబు, స్త్రీవిముక్తి సంఘటన జిల్లా ఉపాధ్యక్షురాలు కా॥ పామర్తి అంజమ్మ తదితరులు ధర్నాలో పాల్గొని ప్రసంగించారు.

**విజయవాడ, 28-1-16 :**

స్థానిక శిఖామణిసెంటర్‌వద్ద రోహిత్ మరణానికి కారకులైన హిందూమతతత్త్వవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ 28-1-16న సిపిఐ(ఎం.ఎల్) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

ఈ ధర్నాను ఉద్దేశించి పార్టీ నాయకులు కా॥వీరబాబు మాట్లాడుతూ మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత హిందూత్వ మతోన్మాదశక్తులకు అడ్డు, అదుపులేకుండా వ్యవహరిస్తూ, పాలనా వ్యవహారాలను శాసిస్తూ ఏం తినాలో, ఏం మాట్లాడాలో, ఏ పుస్తకాలు వ్రాయాలో, చదవాలో, ఎలా నడుచుకోవాలో, ఏ కవితలు, ఏ అభిప్రాయాలు ఫేస్‌బుక్‌లో పెట్టాలో, ఏ బట్టలు ఏవిధంగా కట్టుకోవాలో, ఏ భావాలు ప్రచారం చేయాలో శాసిస్తున్నారన్నారు. సామ్రాజ్య వాదుల అడుగులకు మడుగులొత్తుతున్న ఈ పాలకులు ప్రజలు ఏ చిన్న మార్పు కోరుకున్నా వారిని అణచిపెట్టేందుకు తెగబడు తున్నారని సమాజంలో జరిగే అన్యాయాలపై, దేశం ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని, ప్రపంచ పరిణామాలను అర్థంచేసుకొని, ప్రగతిశీల ప్రజాస్వామిక భావాలు కలిగిన విద్యార్థులు, యువకులు మతోన్మాదశక్తులపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

అనంతరం ఓపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షులు కె.ఏసు మాట్లాడుతూ విద్యార్థులు ప్రగతిశీల ప్రజాస్వామ్య భావాలు కలిగివుండటం వారి ప్రజాస్వామికహక్కు అని, ఇది నచ్చని పాలకులు కులం పేరుతో, మతం పేరుతో విద్యార్థులను వివక్షకు గురిచేస్తూ, కించపరుస్తూ, విద్యార్థులపై దాడులు చేయటం మతోన్మాద శక్తులకు అలవాటైపోయిందన్నారు. ప్రజాస్వామ్య భావాలున్న మేధావులను వేధించటం, వధించటం, మాయం చేయటం, హత్యాకాండ సాగించటం ఎంతోకాలం సాగదని ఆయన హెచ్చరించారు. వేముల రోహిత్ మరణానికి కారకులైన మతోన్మాద శక్తులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఈ ధర్నాకు యు.వీరబాబు, వడ్డాది లక్ష్మణరావు, కాసాని సహదేవుడు, కె.వి.దుర్గారావు, కె.ఏసు తదితరులు నాయకత్వం వహించారు.

ooooo